నమస్తే తెలంగాణ

ఖమ్మం

5 | ఖమ్మం, సోమవారం 20 మే 2024 | KHAMMAM

# ఆలోచించి సాగు..

## అన్నదాత ఆగంకావొద్దు..

పదిమందికి అన్నం పెట్టే రైతన్నకు ఒకటే ఆశ ‘పంట బాగా పండాలి’. అయితే మంచి ఆలోచన కూడా ఉన్నప్పుడే అది నెరవేరుతుంది. అంతేకాదు.. అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలను ఆచరించినప్పుడే సాగులో సంపూర్ణ విజయం సాధ్యమవుతుంది. అనుకున్న దానికంటే ఎక్కువ దిగుబడులు సొంతం చేసుకోవచ్చు. ముఖ్యంగా వానకాలం సీజన్ ప్రారంభంలోనే రైతులు అప్రమత్తంగా ఉండి సాగు మొదలుపెట్టాలి. ఏదో ఒక విత్తనాలు కొని ఎచ్చిపచ్చి దుక్కిలో వేసుకుంటే అవి మొలకలు రాక అదును దాటిపోయి ఆ ఏడాది వ్యవసాయమే ప్రశ్నార్థకం కావచ్చు. అందుకే అన్నదాత ఆగంకావొద్దు.. జర ఆలోచించి ముందుకు‘సాగాలి’.

**– ఖమ్మం వ్యవసాయం, మే 19**

- విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్త తప్పనిసరి
- పంట చేతికొచ్చే వరకు బిల్లులు భద్రం
- అపరిచితుల వద్ద కొంటే అంతే సంగతులు
- వరికొయ్యలు తగులబెడితే పొలాలకు చేటు
- భూసార పరీక్షల ఆధారంగానే సాగు చేపట్టాలి
- పొడిదుక్కిలో విత్తితే చిత్తయిపోయే ప్రమాదం
- ఎర్రనేలలో 50, నల్లనేలలో 60 శాతం తేమ తప్పనిసరి



ఆవిటి మొదటినుంచే విత్తన, పంట ప్రణాళికను సిద్ధం చేసుకొని సాగు పనులు చేపడితే అన్నదాతలు ఆశించిన మేర దిగుబడులు సాధించవచ్చు. పొడి దుక్కిలో విత్తనాలు విత్తుకొని ఆగంకావద్దనే ఉద్దేశంతోనే అధికారులు విత్తనాల విక్రయాలకు ‘స్టాప్ సేల్’ ప్రకటించారు. గ్రామగ్రామాన వ్యవసాయశాఖ అధికారులు అందుబాటులో ఉన్నారు. అవసరమైన విత్తనాలను ప్రభుత్వం సొసైటీల ద్వారా పంపిణీ చేయనుంది. సాగుకు అవసరమైన వాణిజ్య పంటల విత్తనాలను సైతం అధికారులు అందుబాటులో ఉంచుతున్నారు. సమృద్ధిగా వర్షాలు పడి అవసరమైన మేర తేమశాతం నమోదయ్యాక విత్తనాలు విత్తుకుంటే పైరు ఏపుగా పెరిగే అవకాశం ఉంది.

### వరికొయ్యలను కాలిస్తే చేటు..

వరికొయ్యలను పొలాల్లో కాల్చడం ద్వారా అనేక నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని శాస్త్రవేత్తలు రైతులకు సూచిస్తున్నారు. ఒకటన్ను వరిగడ్డి కాల్చడం వల్ల 5.5 కిలోల నత్రజని, 2.3 కిలోల భాస్వరం, 25 కిలోల పొటాషియంతోపాటు 12కిలోల సల్ఫర్‌తోపాటు సేంద్రియ కార్బన్ సైతం కోల్పోయే ప్రమాదముందని చెబుతున్నారు. పంట అవశేషాలను నేలలో చేర్చినట్లైతే నేలకు సేంద్రియ కార్బన్, నత్రజని అంది నేల సారవంతంగా మారుతుంది. మండే అవశేషాల నుంచి వచ్చే వేడి నేలలో ఉష్ణోగ్రతను పెంచుతుంది. దీనివలన ప్రయోజనకరమైన సూక్ష్మజీవులు మరణిస్తాయి. నేల ఆరోగ్యం కాపాడాలంటే అవశేషాలను కాల్చేయడం సరికాదు.

### పత్తికి 60 శాతం తేమ ఉంటేనే..

పత్తి విత్తనాలు నాటుకునే సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. రుతుపవనాలు ప్రవేశించిన తరువాత విస్తారంగా వర్షాలు పడి కనీసం 60–70 శాతం తేమ ఉంటేనే విత్తుకోవాలి. పత్తి సాగుకు ఎర్ర, నల్లరేగడి భూములు మాత్రమే అనుకూలం. ఎర్రనేలలో 50–60 శాతం, నల్లరేగడి భూముల్లో 60–70 శాతం తేమ తప్పనిసరి. ఒకటి రెండు తేలికపాటి వర్షాలకు విత్తుకోవడం సరికాదు. నల్లరేగడి భూముల్లో వర్షాధారంగా సాగు చేస్తే త్వరగా పూత, కాత వచ్చే హైబ్రీడ్ రకాల విత్తనాలను విత్తుకోవాలి.

### అదును చూసి అపరాల సాగు..

వానకాలం సీజన్‌లో మక్కసాగు లేకపోవడం, మార్కెట్లో పప్పులకు రికార్డు స్థాయి ధరలు పలుకుతుండడంతో ఈ ఏడాది జిల్లాలో అపరాల సాగు మరింత పెరిగే అవకాశం ఉంది. జూన్ 15 నుంచి జూలై 15 వరకు పెసలు విత్తుకోవచ్చు. ఎంజీజీ–295, 347, డబ్ల్యూజీజీ–237 వంటి రకాలు అనుకూలంగా ఉన్నాయి. జూలై 15లోపు కంది విత్తనాలు నాటుకునేందుకు అనుకూల సమయం. పెసర, కంది పంటలు పత్తిపంటలో అంతరపంటగానూ సాగు చేసుకోవచ్చు. జూన్ 15 నుంచి జూలై 15 వరకు మినుములు విత్తుకోవచ్చు.

### భూసార పరీక్షలు తప్పనిసరి..

భూసారాన్ని బట్టి పంటల సాగు చేపడితే అధిక దిగుబడులు పొందడమే కాకుండా భూమిలోని పోషకాలు చాలాకాలం పంటలకు అందే అవకాశం ఉంటుంది. దీంతో మంచి ఫలితాలు వచ్చి రైతులు ఆర్థికంగా బలపడే అవకాశం ఉంటుంది. వేసవిలో పంటలు పూర్తిగా చేతికి వచ్చిన తర్వాత రైతు తన పంటపొలంలో వ్యవసాయశాఖ అధికారి సూచనల మేరకు భూసార పరీక్షలు చేయించాలి. దాని ఫలితం ఆధారంగా తదుపరి మూడేళ్లపాటు సాగు చేసుకోవచ్చు.

### విత్తన కొనుగోలులో తస్మాత్ జాగ్రత్త..

విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. కేవలం అధీకృత డీలర్ షాపులో మాత్రమే కొనుగోలు చేయాలి. అనధికార వ్యక్తుల నుంచి కొనుగోలు చేయరాదు. విత్తనాలు కొనుగోలు చేసిన తరువాత బిల్లు (రసీదు) తప్పనిసరిగా తీసుకోవాలి. బిల్లులో విత్తనం లాట్ నెంబర్, ముగింపు కాలపరిమితి వివరాలు చూసుకోవాలి. బిల్లుపై రైతు సంతకంతోపాటు అధీకృత డీలర్ సంతకం ఉండాలి. పంటకాలం ముగిసేవరకు విత్తన ప్యాకెట్, రసీదు భద్రంగా దాచిపెట్టుకోవాలి. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు. ఏయే రకం విత్తనాలు కొనుగోలు చేయలో స్థానిక ఏఈవో, ఏవో సలహాలు తీసుకుంటే మరింత మంచిది.



విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు (ఫైల్)

### అధికారుల సూచనలు పాటించాలి



మరికొద్దిరోజుల్లో వర్షాలు విస్తారంగా కురిసే అవకాశం ఉంది. సాగుకు ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులు అవగాహన కలిగి ఉండాలి. పంటపొలాల్లో ఎట్టి పరిస్థితిలో వరికొయ్యలు తగులబెట్టవద్దు. పొడిదుక్కుల్లో విత్తనాలు వేయవద్దు. గ్రామాల్లో ఎవరైనా విత్తనాలు విక్రయిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలి. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలతోనే రైతులు సాగుకు శ్రీకారం చుట్టాలి.

**– ఎం.విజయనిర్మల, డీఏవో, ఖమ్మం**



పంట పొలాల్లో వరికొయ్యలు తగులబెడుతున్న దృశ్యం

# నేడు జిల్లాకు కేటీఆర్

- **బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రచారం**
- **ఉదయం ఇల్లెందులో, మధ్యాహ్నం కొత్తగూడెంలో పర్యటన, సమావేశాలు**
- **సాయంత్రం ఖమ్మం ఎస్‌బీఐటీ కళాశాలలో పట్టభద్రులతో మీటింగ్**
- **పాల్గొననున్న అజయ్, నామా, వద్దిరాజు, తాతా మధు తదితరులు**



ఖమ్మం, మే 19 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సోమవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. నల్గొండ – ఖమ్మం – వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రచారం నిర్వహించనున్నారు. అయితే ఇప్పటికే పార్టీ అభ్యర్థి విజయం కోసం బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఇప్పటికే కదనరంగంలోకి దిగి పని చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌లు హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో ఖమ్మం జిల్లా పార్టీ నాయకులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. శాసనమండలి ఎన్నికలకు నేతలను సమాయత్తం చేశారు. ఈ సమావేశానికి జిల్లాకు చెందిన మాజీ మంత్రి, ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ తదితర నాయకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఇప్పటికే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వర రావు విజయం కోసం పార్టీ నాయకులందరూ తీవ్రంగా శ్రమించారు. అదే స్ఫూర్తితో నల్గొండ – ఖమ్మం – వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కేసీఆర్, కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఇప్పటికే అభ్యర్థి రాకేశ్‌రెడ్డితోపాటు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం ఉమ్మడి జిల్లాలో విస్తృతంగా పర్యటించి ప్రచారం చేయనున్నారు.

### టూర్ షెడ్యూల్ ఇలా..

ఖమ్మం – నల్గొండ – వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం ప్రచారం చేయనున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు ఇల్లెందు పట్టణానికి చేరుకుంటారు. అక్కడి జేకే గ్రౌండ్స్‌లో పట్టభద్రులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 12 గంటలకు కొత్తగూడెంలోని కొత్తగూడెం క్లబ్‌కు చేరుకుంటారు. అక్కడ కూడా పట్టభద్రులతో సమావేశమవుతారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు ఖమ్మంలోని ఎస్‌బీఐటీ కాలేజీకు చేరుకున్నారు. ఆ కళాశాల ప్రాంగణంలో పట్టభద్రులతో జరిగే సమావేశానికి హాజరవుతారు.

# కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

**బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని ఆశీర్వదించండి: నామా**



ఖమ్మం, మే 19: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సోమవారం జరుగనున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. వరంగల్ – ఖమ్మం – నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఉమ్మడి జిల్లాలో ఆయన ప్రచారం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇల్లెందు, కొత్తగూడెం, ఖమ్మంలలో జరిగే ఈ ప్రచారానికి పట్టభద్రులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. బ్యాలెట్ పేపర్‌లోని మూడో క్రమ సంఖ్యలో రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన ఉన్నత విద్యావంతుడు రాకేశ్‌రెడ్డి అని గుర్తుచేశారు. సేవ చేయాలనే ఉన్నతాశయంతోనే అతడు రాజకీయాల్లోకి వచ్చినట్లు చెప్పారు. చట్టసభల్లో పట్టభద్రుల గొంతు వినిపించేందుకు రాకేశ్‌రెడ్డిని గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

# రాకేశ్‌రెడ్డిని గెలిపించుకుందాం..

**నేటి మాజీ మంత్రి కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయండి**

**కొత్తగూడెం సమావేశానికి పట్టభద్రులు తరలిరావాలి: వనమా**

కొత్తగూడెం అర్బన్, మే 19: ఖమ్మం – నల్గొండ – వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించుకుందామని కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. కొత్తగూడెంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి గెలుపు కోసం ప్రచారం నిర్వహించేందుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సోమవారం కొత్తగూడేనికి రానున్నట్లు చెప్పారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించనున్న సమావేశానికి పట్టభద్రులు తరలిరావాలని కోరారు. అలవిగాని, ఆచరణకు సాధ్యంకాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్.. ఇప్పుడు ఆ వాగ్దానాలను తుంగలో తొక్కిందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రస్తుతం కరువు పరిస్థితులు నెలకొన్నాయని, రైతులందరూ ఆందోళన చెందుతున్నారని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసినందుకు ప్రతి ఒక్కరూ బాధపడుతున్నారని అన్నారు. రుణమాఫీ గురించి అడిగితే సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్లు వేస్తున్నారని విమర్శించారు. ఎన్నికలప్పుడు ఒకమాట, ఎన్నికలయ్యాక మరోమాట మాట్లాడుతూ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. మళ్లీ సీఎంగా కేసీఆర్ రావాలని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటుకావాలని రాష్ట్రంలోని మహిళలు, యువకులు, విద్యార్థులు, ఉద్యోగులతోపాటు అన్ని వర్గాల ప్రజలూ కోరుకుంటున్నారని అన్నారు. పట్టభద్రులు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని, బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రశ్నించే గొంతు మండలిలో ఉండాలని, పట్టభద్రుల సమస్యలను పరిష్కరించగలిగే సత్తా రాకేశ్‌రెడ్డికే ఉందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కాపు సీతాలక్ష్మి, బాదావత్ శాంతి, భూక్యా సోన, వేల్పుల దామోదర్, బండి నర్సింహారావు, వేముల ప్రసాద్‌బాబు, అంబుల వేణుగోపాల్, కొట్టే వెంకటేశ్వరరావు, కూరపాటి సుధాకర్, మోరె భాస్కర్‌రావు, కనుకుంట్ల శ్రీను, కోసున వాసు, అన్వర్‌పాషా, యాకూబ్, బొమ్మిడి శ్రీకాంత్, విజయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

# బీఆర్ఎస్ అభ్యర్థికి అధిక మెజార్టీ ఇవ్వాలి

**గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ఖమ్మం నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్‌జేసీ కృష్ణ**



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు ఆర్‌జేసీ కృష్ణ

ఖమ్మం, మే 19: ఈ నెల 27న జరుగనున్న నల్గొండ – ఖమ్మం – వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి అధిక మెజార్టీ అందించాలని పార్టీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఖమ్మం నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్‌జేసీ కృష్ణ, పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ కోరారు. ఖమ్మంలోని ఎస్‌బీఐటీ కళాశాల ప్రాంగణంలో ఆదివారం జరిగిన ముఖ్య కర్యాకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. శాసనమండలి పట్టభద్రుల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు ఖమ్మంలోని ఎస్‌బీఐటీ కాలేజీ ప్రాంగణంలో పట్టభద్రులతో జరిగే సమావేశానికి మాజీ మంత్రి కేటీఆర్ హాజరుకానున్నట్లు చెప్పారు. పట్టభద్రులందరూ పాల్గొని ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేనికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సహా ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు.

# పాలేరు ప్రజల రుణం తీర్చుకుంటా..

పార్టీలకు అతీతంగా పథకాల లబ్ధి చేకూరుస్తా..

ఖమ్మం రూరల్ పర్యటనలో మంత్రి పొంగులేటి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం రూరల్, మే 19: పాలేరు నియోజకవర్గ ప్రజలను జన్మజన్మలా గుర్తుపెట్టుకుంటానని, వారి రుణం తప్పకుండా తీర్చుకుంటానని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ‘మీ చెంతకే మీ మంత్రి పొంగులేటి’ అనే నినాదంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా ఖమ్మం రూరల్ మండలంలో ఆదివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. తొలుత రెడ్డిపల్లిలోని మారెమ్మతల్లి దేవాలయంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రెడ్డిపల్లి గ్రామస్తులతో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గ్రామంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల గురించి గ్రామపెద్దలు, ముఖ్య నాయకులను అడిగి తెలుసుకున్నారు. తరువాత పద్మశ్రీ వనజీవి రామయ్యతో కాసేపు ముచ్చటించారు. అనంతరం పోలేపల్లి, పల్లెగూడెం, గోళ్లపాడు, తీర్థాల, పొలిశెట్టిగూడెం, మంగలిగూడెం, తనగంపాడు, గూడూరుపాడు, ఎం.వెంకటాయపాలెం, కాచిరాజుగూడెం, ఆరెకోడుతండా, ఆరెకోడు, చింతపల్లి, ఆరెంపుల గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా పనిచేస్తానని, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ, ప్రతి వ్యక్తికీ సంక్షేమ పథకాలు అందజేస్తానని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం అనేక దరఖాస్తులు వస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

# మొదటి ప్రాధాన్య ఓటుతో రాకేశ్‌రెడ్డిని దీవించండి

**మాజీ మంత్రి కేటీఆర్ పర్యటన ఏర్పాట్ల పరిశీలనలో మాజీ ఎమ్మెల్యే హరిప్రియ**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందు, మే 19: పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని మొదటి ప్రాధాన్య ఓటుతో దీవించాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ కోరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సోమవారం ఇల్లెందులో పర్యటించి పట్టభద్రులతో సమావేశం కానున్న నేపథ్యంలో స్థానిక జేకే కాలనీ సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో సంబంధిత ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన అనేక హామీలను ఎన్నికల అనంతరం విస్మరించిందని విమర్శించారు. ఇలాంటి మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు తగిన బుద్ధిచెప్పాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు దిండిగాల రాజేందర్, లక్కినేని సురేందర్, పరుచూరి వెంకటేశ్వర్లు, సిలివేరి సత్యనారాయణ, జేకే శ్రీను, శీలం రమేశ్, వరప్రసాద్, అంతోటి అచ్చయ్య, తాత గణేష్, రేణుక, కృష్ణారావు, నబి, మహేందర్, రాజేశ్, చాంద్, ప్రమోద్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలం సమీపిస్తోంది..

# ఆదివాసీలు అప్రమత్తంగా ఉండాలి..

**వైద్యశాఖ సూచనలు పాటించండి.. ఆరోగ్యాన్ని కాపాడుకోండి..**

**పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి: ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్**



భద్రాచలం, మే 19: వర్షాకాలం సమీపిస్తున్నందున ఆదివాసీ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. వైద్యశాఖ సిబ్బంది సూచిస్తున్న జాగ్రత్తలు పాటించాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ప్రస్తుతం చెదురుమదురు వర్షాలు పడుతున్న సందర్భంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఇంటి ఆవరణలో పాత కూలర్లు, పూల కుండీలు, పాత టబ్బులు, పాత టైర్లు, పాత వస్తువులు ఏమైనా ఉన్నట్లయితే వాటిలో వర్షపు నీరు నిలువకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాటిల్లో వర్షపు నీరు చేయడం వల్ల దోమలు గుడ్లు పెట్టి వ్యాప్తి చెందుతాయని అన్నారు. దోమలు కుట్టడం వల్ల డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, బోధకాలు, మెదడు వాపు తదితర ప్రాణాంతక వ్యాధులు వస్తాయని వివరించారు. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో కచ్చితంగా డ్రైడేగా పాటించి ఇంటి ఆవరణలో నీరు నిల్వ లేకుండా జగ్రత్త పడాలని ఆదేశించారు. జ్వరం వచ్చినట్లయితే గ్రామంలో ఉన్న ఆశావర్కర్‌నుగానీ, వైద్య సిబ్బందిని గానీ సంప్రదించాలని సూచించారు. వారు ప్రథమ చికిత్స చేసి సలహాలు సూచనలు ఇస్తారని అన్నారు. అవసరమైన ప్రభుత్వ ఆసుపత్రికి పంపించి రక్త పరీక్ష చేయిస్తారని, నమూనాలను టీ హబ్‌కు పంపించి వ్యాధులను నిర్ధారించేందుకు చర్యలు తీసుకుంటారని అన్నారు. ఎక్కువగా యాంటీ బయోటిక్ మందులు వాడినట్లయితే ప్రజలకు వ్యాధినిరోధక శక్తి తగ్గిపోతుందని అన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# పట్టభద్రులు, బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలి: రేగా కాంతారావు



భద్రాద్రి కొత్తగూడెం, మే 19 (నమస్తే తెలంగాణ): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం కోసం సోమవారం భద్రాద్రి జిల్లాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటించనున్నందున.. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఖమ్మం – వరంగల్ – నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి అత్యధిక మెజార్టీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాకేశ్‌రెడ్డి విజయం కోసం జిల్లాకు వస్తున్న మాజీ మంత్రి కేటీఆర్.. తొలుత ఇల్లెందులోనూ, తరువాత కొత్తగూడెంలోనూ పట్టభద్రులతో సమావేశమవుతారని అన్నారు. సమావేశాలకు ఆయా నియోజకవర్గాల్లోని గ్రాడ్యుయేట్లు, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు.